సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 23 । జూలై । 2025



పోయాం.. మోసం

ఉపాధ్యాయ, ఉద్యోగులకు నాలుగు డీఏల బకాయి ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. - 8లో



వైద్య శాఖ పంచాయితీ

వైద్యశాఖ పంచాయితీ కలెక్టరేట్‌కు చేరింది. బదిలీలపై ఆరోపణలు ఉన్నాయి. - 8లో



జాతీయ జెండాతో చిన్నారుల గీతాలాపన

కంచిలి: బూరగాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జాతీయ జెండాతో మంగళవారం గీతాలాపన చేశారు. పతాకం ఆమోదం పొందిన రోజు కావడంతో పింగళి వెంకయ్యను స్మరించుకున్నారు.

న్యూస్‌రీల్

అర్హత ఉన్నా అందని 'తల్లికి వందనం'

హిరమండలం: అన్ని రకాలుగా అర్హత ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో ఓ కుటుంబానికి తల్లికి వందనం పథకం వర్తించలేదు. బాధిత కుటుంబానికి అసలు విద్యుత్ కనెక్షనే లేదు..కానీ 74 సర్వీసులు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. దీంతో వీరికి పథకం రాలేదు. గులుమూరు పంచాయతీ జగన్నాథపురం సమీపంలో రేకుల షెడ్‌లో నిమ్మక పెంటయ్య, ఈశ్వరి దంపతులు నివసిస్తున్నారు. వీరి ముగ్గురు పిల్లలు హేమంత్, జస్మిత, దార్మిక్‌లు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వీరి ఇంటికి పూర్తిగా విద్యుత్ కనెక్షనే లేదు. కానీ వీరి ఆధార్‌తో అనుసంధానమై 74 కనెక్షన్లు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. పోలాకి మండలంలో 5, రణస్థలంలో 4, జి.సిగడాంలో 3, లావేరులో 8, పొందూరులో 34, ఎచ్చెర్లలో 20 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు చూపిస్తోంది. దీనిపై పెంటయ్య హిరమండలం విద్యుత్ ఉపకేంద్రంలో విన్నవించగా ఇన్‌చార్జ్ ఏఈ వెంకటేశ్వరరావు వీరి పేరున హిరమండలంలో ఎలాంటి విద్యుత్ కనెక్షన్ లేదని లేఖ ఇచ్చారు. ఆ లేఖను చూపించినా వారికి పథకం రాలేదు.

గార, హిరమండలం ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్యం, మురుగుకాలువల శుభ్రత పనుల్లో నిర్లక్ష్యం చూపిన గార, హిరమండలం ఎంపీడీఓలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పీఆర్జీఎస్, కోర్టు కేసులు, ఎరువుల పంపిణీ, పి-4 సర్వే పురోగతి వంటి అంశాలపై విపులంగా సమీక్షించారు. నీటి నాణ్యత పరీక్షలు, కాలువల శుభ్రత, హాస్టళ్ల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఎరువుల పంపిణీలో అలసత్వం పనికిరాదని, కొరత అనే పదం వినిపించకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

సంతబొమ్మాళి: నేషనల్ లెవల్ మానిటరింగ్ టీమ్ సభ్యులు సునీల్ బంటా, నామాసింగ్ బృందం మండలంలోని బోరుభద్ర, ఉమిలాడ పంచాయతీల్లో మంగళవారం పర్యటించారు. ఆయా పంచాయతీల్లో ఉపాధి హామీ వేతనదారులు, డ్వాక్రా మహిళలు, గృహనిర్మాణ పనుల లబ్ధిదారులతో ముచ్చటించారు. ఉపాధి పనులు గ్రామానికి ఎంత దూరంలో చేస్తున్నారు, బిల్లులు అందుతున్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రుణాలు సకాలంలో అందుతున్నాయా, ఆ రుణాలతో ఎలాంటి స్వయం ఉపాధి కార్యక్రమాలు చేస్తారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ఉపాధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎగబడితేనే ఎరువు



ఎల్ఎన్‌పేటలో ఎరువుల కోసం ఒక్కసారిగా దూసుకొచ్చిన రైతులకు సర్దిచెబుతున్న ఏపీ

అధికారులేమో ఎరువుల కొరత లేదని చెబుతున్నారు. రైతులు మాత్రం ఎదురుచూసీ చూసీ ఎగబడితే గానీ ఎరువు దొరకడం లేదు. ఎల్ఎన్‌పేట మండలంలోని పెద్దకోట 1, 2 రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు మంగళవారం ఎరువులు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒకేసారి వందలాది మంది రావడంతో గందరగోళం నెలకొంది. అధికారులు అందరికీ సర్దిచెప్పేటప్పటికి వారి తల ప్రాణం తోకకు వచ్చింది. - హిరమండలం









• నిర్లక్ష్యపు వ్యాధి

శ్రీకాకుళంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రజాధనంతో కొన్న సామగ్రి ఇలా వృథా అవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాల్సిన మెడికల్ సామగ్రిని వృథాగా పడి వేయడంతో పూర్తిగా పాడైపోయాయి. వీటి విలువ సుమారుగా రూ.10 లక్షల వరకు ఉంటుందని అంచనా. నిత్యం అధికారులు ఆ పక్క నుంచే వెళ్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిపోయారు. 'ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మేయాలి. ఇప్పుడంత డబ్బులు ఎక్కడున్నాయి' అంటూ విజయనగరం జిల్లా కొత్తవలసలో అచ్చెన్న చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ చేతగానితనాన్ని తేటతెల్లం చేశాయని ప్రజలంటున్నారు. ఎన్నికల ముందు ఇష్టానుసారం హామీలిచ్చి ఇప్పుడు అమలు చేయలేమంటూ చేతులెత్తేయడంపై మండిపడుతున్నారు.



• అన్నన్నా.. అచ్చెన్నా..

ఆడబిడ్డకు అంత అన్యాయమా!

- ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మేయాలంటూ అచ్చెన్న చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్
- ఓట్లేసిన ప్రజలనే మోసగించారంటూ మండిపడుతున్న నెటిజన్లు
- అచ్చెన్న గతంలో చేసిన కామెంట్లను గుర్తు చేస్తున్న వైనం



ఆడబిడ్డ నిధి ప్రతి మహిళకు నెలకు రూ.1,500

'రైతులకు ఆశ ఎక్కువ. పంట పండించక ముందు ఆలోచించాలి. పండించాక నష్టపోయామని బాధపడకూడదు. మార్కెట్‌లో పంట అమ్మకాలను పసిగట్టి పంటలు వేసుకోవాలి'. - రైతులనుద్దేశించి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలివి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సూపర్ సిక్స్ హామీల అమలు విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైన సంగతి అందరికీ తెలిసిందే. 50 ఏళ్లకు పింఛన్ ఊసెత్తడం మానేశారు. తల్లికి వందనం ఒక ఏడాది ఎగ్గొట్టేశారు. ఇప్పుడు కూడా అనేక ఆంక్షలు పెట్టారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వాయిదాలు పడుతూనే ఉంది. అన్నదాత సుఖీభవ గత ఏడాది ఇవ్వనేలేదు. ఈ ఏడాది కూడా ఇస్తారో లేదో అన్నట్లు ఉంది. ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి పథకాలకు అతీగతి లేదు. ఉచిత గ్యాస్ హామీలు కూడా గాలి మాటలేనని తేలిపోయింది.

ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలట?

ఇన్ని పథకాలు అమలు చేయకపోయినా అన్నీ అమలు చేసేశామని టీడీపీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇక 19 నుంచి 60ఏళ్ల లోపు

'ప్రతీ టీడీపీ కార్యకర్త. ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్లినా.. ఎంపీడీఓ దగ్గరకు వెళ్లినా... ఎస్ఐ దగ్గరకు వెళ్లినా...ఏ ఆఫీసుకు వెళ్లినా పసుపు బిళ్ల పెట్టుకుని వెళ్లండి. మీకు గౌరవంగా కుర్చీ వేసి, టీ ఇచ్చి మీ పని ఏంటని అడిగి... మీ పని చేసే విధంగా అధికారులను లైన్లో పెడతా...ఎవరైనా ఒకరో ఇద్దరో అధికారులు మాట జవదాటితే వారు ఏమవుతారో వారికి చెప్పాల్సిన అవసరం లేదు.' - అధికారంలోకి వచ్చాక అచ్చెన్న చేసిన వ్యాఖ్యలివి..

మహిళలకు నెలకి రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి కింద ఇస్తామన్న హామీకి తొలి ఏడాది పంగనామం పెట్టారు. ఈ ఏడాదైనా ఇస్తారేమో అని మహిళలు అంతా ఆశతో చూస్తున్నారు. ఒక్క మన జిల్లాలోనే 7,59,692మంది మహిళలు నిరీక్షిస్తున్నారు. ఇప్పుడా ఆశలపై మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలతో నీళ్లు జల్లేసినట్టు అయిపోయింది. ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయాలంటే ఆంధ్రాను అమ్మేయాల్సి వస్తుందని బహిరంగ సభలో వ్యాఖ్యానించారు. దీంతో ఆడబిడ్డ నిధి పథకం లేనట్టే అని సంకేతాలు ఇచ్చినట్టయ్యింది. దీనిపై మహిళలంతా మండిపడుతున్నారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక మాట మార్చడమేంటని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ ప్రతీసారి ఇదేరకంగా మోసం చేస్తోందని అంటున్నారు.

సోషల్ మీడియాలో వైరల్

అచ్చెన్న తాజా వ్యాఖ్యలతో ఆయన పాత మాటలు కూడా ట్రెండింగ్‌లోకి వచ్చాయి. గతంలో చేసిన కామెంట్లతో పార్టీ పరువు పోగా, ఆడబిడ్డ నిధి కోసం రాష్ట్రం అమ్మేయాలన్న వ్యాఖ్యలతో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిపోయింది.

'పార్టీ లేదు...బొక్కా లేదు... ఆడే బాగుంటే...మనకెందుకీ పరిస్థితి' - తిరుపతి లోకసభ ఉప ఎన్నికల సమయంలో ఓ హోటల్‌లో టిఫిన్ చేస్తూ టీడీపీ నాయకుడితో అన్నమాటలు ఇప్పటికీ అందరికీ గుర్తే.

హామీలు ఎందుకు ఇచ్చారు..?



ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయలేమని తెలిసిన కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు ఎందుకు హామీ ఇచ్చాయి. మంత్రి అచ్చెన్నాయుడు ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని అనడం సరికాదు. ఇది ప్రజల్ని మోసం చేయడం కాదా?

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త

దారుణ వంచన



కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. ఇంతకంటే మోసం ఉంటుందా..? ఒక బాధ్యతాయుతమైన మంత్రి ఇలాంటి ప్రకటన చేయడం ఏంటి.? మహిళలను మోసం చేస్తున్న కూటమికి గుణపాఠం తప్పదు. వైఎస్ జగన్ చిత్తశుద్ధిగా పథకాలు అమలు చేశారు.

– రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు

ఇవ్వలేమని తేల్చేశారు..



మంత్రి అచ్చెన్నాయుడు బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలు.. పూర్తిగా ఆడబిడ్డ ఇవ్వలేమని తేల్చి చెప్పేసినట్టే. ఎన్నికల మునుపు మహిళలకు హామీలిచ్చి అధికారం దక్కించుకోవడం ఆ తర్వాత మహిళల్ని దగా చేయడం చంద్రబాబు ప్రభుత్వానికే సాధ్యం.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి

ఇవ్వకపోతే పోరాటం చేస్తాం



ఆడబిడ్డ నిధి కింద రూ.1500 ప్రతి నెలా ఇవ్వకపోతే పోరాటం చేస్తాం. అచ్చెన్న వ్యాఖ్యల వెనుక ఆంతర్యం ఏమిటి.? దీన్ని మోసం కాక ఇంకేమంటారు.? గత ఏడాది బకాయితో కలిపి మొత్తం చెల్లించాలి.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త

అక్రమ ఇసుక ర్యాంపులు ఆపాల్సిందే

- శ్మశానాలనూ వదలకుండా తవ్వేయడం సబబు కాదు
- పాతనిమ్మతొర్లువాడ వాసులపై దాడి దారుణం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



పాత నిమ్మతొర్లువాడలో బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్, చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస మండలంలోని కొత్తవలసలో కొనసాగుతున్న అనధికార ఇసుక ర్యాంపును ఆపాల్సిందేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్‌తో కలిసి కొత్తవలస, పాత నిమ్మతొర్లువాడ ఇసుక ర్యాంపులను పరిశీలించారు. అనంతరం ఇసుకాసురుల దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ నదీగర్భం వరకు తవ్వకాలు చేయడం దారుణమన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ తవ్వకాలు జరుగుతున్నాయని అన్నారు. నారా లోకేష్ ఆధ్వర్యంలోనే అనధికార ర్యాంపులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంత ఘోరంగా తవ్వుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తవలస నుంచి ఆమదాలవలసకు తాగునీరు అందించే సౌకర్యం ఉందని, ఇసుక తవ్వకాలతో అది ప్రమాదంలో పడుతుందన్నారు. కొత్తవలస పక్కనే ఉన్న పాత నిమ్మతొర్లువాడలో తవ్వకాలు చేస్తున్నారని, శ్మశాన వాటిక, మైదానాన్ని విడిచిపెట్టాలని కోరితే వంద మంది కర్రలు, రాడ్లులతో దాడికి పాల్పడడం అమానుషమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు.

'కూన' సన్నిహితులే దాడి చేశారు..

ఆమదాలవలసలో నిర్వహిస్తున్న అక్రమ ఇసుక ర్యాంపులు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయని చాలాసార్లు ఫిర్యాదు చేశామని పార్టీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. రాత్రివేళలో అమాయకులైన పాతనిమ్మతొర్లువాడ గ్రామ ప్రజలపై దాడికి పాల్పడడం ఎంతవరకు సమంజసమన్నారు. సీసీ ఫుటేజీ చూస్తే ఎవరు దాడి చేశారో తెలిసిపోతుందని, పోలీసులు దాచి పెట్టాల్సిన అవసరం ఏముందన్నారు. బాధితులను పరామర్శించేందుకు వస్తున్నామని తెలిసి గాయపడిన వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, ఆమదాలవలస మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, ముఖ్యనాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, దుంపల శ్యామలరావు, మానుకొండ వెంకటరమణ, ఎ.రవికాంత్, గురుగుబెల్లి అప్పలనాయుడు, చిగురుపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

ఎమ్మెల్యేను కలిశారా..?

- పాతపట్నం నియోజకవర్గంలో వింత సంస్కృతి
- సచివాలయ ఉద్యోగులతో ఎంపీడీఓల చెడుగుడు
- ఎమ్మెల్యేను కలవాల్సిందేనని హుకుం



పాతపట్నం: కొత్తగా ఆఫీసులో చేరాలంటే ఎమ్మెల్యే లెటర్ ఉండాలి. ట్రాన్స్‌ఫర్ అయిన ఉద్యోగి మరోచోట జాయిన్ కావాలంటే ఎమ్మెల్యే ఆ ఉద్యోగి పేరు ముందుగానే చెప్పి ఉండాలి. బదిలీ తర్వాత విధుల్లో చేరాలంటే ఎమ్మెల్యేను కలిశాకే ఆఫీసుకు రావాలి.. పాతపట్నంలో అమలవుతున్న వింత సంస్కృతి ఇది. ముఖ్యంగా సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యేను కలిశాకే ఏ పనైనా చేయాలని అధికారులే హుకుం జారీ చేస్తున్నారు.

తాజాగా పాతపట్నం మండలంలోని కాగువాడ సచివాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి మెళియాపుట్టి మండలం మర్రిపాడు-సి, కరజాడ, కోటబొమ్మాళి మండలం కురుడు అంటూ మూడు చోట్లకు బదిలీ చేశారు. ఆ ఉద్యోగి అక్కడ బాధ్యతలు స్వీకరించేందుకు వెళ్లారు. అయితే 'ఎమ్మెల్యే నీ పేరు చెప్పలేదు. రెండు రోజులు ఆగు మాట్లాడి చెబుతా' అనే సమాధానం ఎంపీడీఓ నోటి నుంచి వినిపించడంతో ఆ ఉద్యోగి అవాక్కయ్యారు. మరో ఉద్యోగికి పాతపట్నం మండలంలోని బడ్డుమర్రి బదిలీ అయ్యింది. తీరా అక్కడకు వెళ్తే 'నిన్ను వేరే సచివాలయానికి మార్చేశా' అని ఎంపీడీఓ చెప్పడంతో అతను



గ్రామ సచివాలయం

నివ్వెరబోయారు. ఇంకో ఉద్యోగికి కొత్తూరు మండలం నుంచి పాతపట్నం మండలంలోని ఓ సచివాలయానికి బదిలీ కాగా, విధుల్లో చేరేందుకు వెళితే ఎమ్మెల్యేని కలిసి రావాలని, లేదంటే ఆయన పీఏతోనైనా ఫోన్ చేయించాలని సాక్షాత్తు ఎంపీడీఓ తెగేసి చెప్పేశారు. పాతపట్నంలో ఈ విష సంస్కృతికి వేళ్లూనుకుంటోంది. ప్రజా ప్రతినిధుల వేధింపులతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కొత్త స్థానాల్లో విధుల్లో చేరలేక నరకం చూస్తున్నారు.

నియోజకవర్గంలోని 91 గ్రామ సచివాలయాల్లో 718 మంది ఉద్యోగులు వివిధ కేడర్‌లలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు బదిలీల కసరత్తు నిర్వహించారు. బదిలీ అయిన వారు జూలై 10లోపు కొత్తస్థానాల్లో చేరిపోవాలి. కానీ ఇలా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చాలా మంది ఇప్పటికీ విధుల్లో చేరలేదు. 'ఎవరి అనుమతితో ఇక్కడకు వచ్చావు' వంటి ప్రశ్నలు ఎదురవుతుండడంతో వారికి ఏం చేయాలో పాలుపోవడం లేదు.

నమస్తే పెట్టి వెళ్లు..

కొత్త స్థానాల్లో చేరేందుకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులను ఎంపీడీఓలు వేధిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరో వైపు ఎమ్మెల్యేల పీఏలు కాల్ చేసి, 'ఒక సారి వచ్చి ఎమ్మెల్యేకు నమస్తే పెట్టి వెళ్లు' అంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, వారి పీఏలు, ఎంపీడీఓలు ఇలా ఎవరికి వారు సచివాలయ ఉద్యోగులతో చెడుగుడు ఆడుకుంటున్నారు.

పట్టించుకోని జిల్లా యంత్రాంగం

సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలను జారీచేసింది. కలెక్టర్ అనుమతితో నిబంధనలను అనుసరించి బదిలీలు చేపట్టారు. ఈ ప్రక్రియలో నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సులు చెల్లకపోవడంతో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేధింపులు సరికాదు



సచివాలయ ఉద్యోగులపై రాజకీయ వేధింపులకు పాల్పడటం సరైన పద్ధతి కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిరుద్యోగులనే టార్గెట్ చేస్తోంది. ఇది దుర్మార్గమైన పద్ధతి. నిబంధనల మేరకు బదిలీలు పొందిన సచివాలయ ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సబబు కాదు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి.

– పోలాకి ప్రసాదరావు, సీపీఎం, జిల్లా కార్యవర్గ సభ్యుడు, శ్రీకాకుళం

క్లుప్తంగా

నవజీవన ఆశ్రమంలో తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి హరిబాబు

గార: మౌలిక వసతుల కల్పనతో పాటు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా నిర్వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి కె.హరిబాబు అన్నారు. మంగళవారం శ్రీకూర్మంలోని నవజీవన ఆశ్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థుల హాస్టల్, తరగతి గదులు, వంటశాల పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేపట్టారు. ఏమైనా సమస్యలుంటే పరిశీలనకు వచ్చే అధికారులకు తెలియజేయాలన్నారు.

కార్డన్ సెర్చ్ కలకలం


వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

టెక్కలి రూరల్: టెక్కలి మండల కేంద్రంలోని గొల్లవీధిలో సీఐ ఎ.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అపరిచితులు, నిషేధిత పదార్థాలకు సంబంధించి ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కాగా, ఇతర పత్రాలు సక్రమంగా ఉన్నా సీ బుక్‌లో ఉన్న వ్యక్తి లేకపోయినా వాహనం తీసుకువెళ్లిపోయారంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

శభాష్ అయ్యవార్లు!


కొత్తపెంట పాఠశాలలో చేరిన తమ పిల్లలతో ఉపాధ్యాయులు

జి.సిగడాం: మండలంలోని కొత్తపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పొగిరి పండు అప్పలనాయుడు, మక్క లక్ష్మునాయుడు, వి.మమత స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తమ పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో కాకుండా అత్యుత్తమ ఫలితాలు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి అభినందనలు అందుకుంటున్నారు. వీరి పిల్లలు పొగిరి నూతన్ కుమార్(6వ తరగతి), మక్క మోక్ష వర్షిణిచ, వేదిత్‌లను కొత్తపెంట స్కూల్లోనే చేర్పించడంతో ప్రధానోపాధ్యాయులు ఎస్.భానుమూర్తి, వి.రవి, గ్రామస్తులు అభినందించారు.


కర్షకులకు కొనసాగుతున్న కష్టాలు

- ఎరువుల కోసం తప్పని పాట్లు


కొత్తూరు రైతుసేవాకేంద్రంలో అధిక సంఖ్యలో రైతులు

కొత్తూరు: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో ఎరువులను అందుబాటులోకి తీసుకొచ్చామని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. కొత్తూరు రైతు సేవా కేంద్రానికి ప్రభుత్వం 20 టన్నులు యూరియా కేటాయించింది. తక్కువ మొత్తంలో రావడంతో రైతులు రెండు రోజులుగా ఆర్‌ఎస్‌కేల చుట్టూ తిరుగుతున్నారు. మంగళవారం యూరియా విక్రయిస్తారని గ్రామ వ్యవసాయ సహాయకులు చెప్పడంతో పెద్ద సంఖ్యలో రైతులు చేరుకున్నారు. అడంగల్ పత్రాలు ఉన్న రైతులకు మాత్రమే యూరియా విక్రయిస్తామని చాలామంది నిరాశతో వెనుతిరిగారు.

పెన్‌కాక్‌సిలాట్‌లో పతకాల పంట


పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు, జిల్లా సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సౌత్‌జోన్ నేషనల్స్ పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. తమిళనాడులోని త్రిచి జిల్లాలో ఉన్న కొంగునాడు ఇంజినీరింగ్ కాలేజీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు 6వ సౌత్‌జోన్ పెంకాక్‌సిలాట్ పోటీలు జరగగా.. అంధవరపు సాయి ప్రశాంత్, దున్న సుచరిత, కొండేటి హరీష్, బంగారు పతకాలు సాధించారు. దున్న సుమన, రెడ్డి యోగామృత, అంధవరపు లలిత్‌మిదిన్, పి.షాన్, కె.దీక్షిత రజత పతకాలు, బి.నాగేశ్వరి, బి.జ్యోతి సాయి ప్రసాద్, సాన సుజిత్ శంకర్, ఎస్.సహస్ర, బి.కార్తికేయ, పి.పవన్, పి.రాకేష్ నాయుడు, మండా రామ్‌సాయి, విహాస్ శర్మ కాంస్య పతకాలు సాధించారు. వీరిని పెన్‌కాక్‌సిలాట్ సంఘ జిల్లా అధ్యక్షులు రేగిడి దయమయ, ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణ్ నాయుడు, శ్రీ పరశురామ యుద్ధకళా క్షేత్రం కోచ్ లింగాల ఈశ్వర్‌రావు అభినందించారు. హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కోచ్ హేమంత్ యాదవ్, హరీష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు చేరిన..
వైద్యశాఖ పంచాయితీ

- బదిలీల్లో అంతులేని అవినీతి!
- రెండు రోజులుగా దొరకని పరిష్కారం
- ఇద్దరు ఉద్యోగులపై చర్యలకు సిద్ధం


వైద్య శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న బదిలీల సెక్షన్

శ్రీకాకుళం పాతబస్టాండ్:

గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్‌ఎంల బదిలీలకు సంబంధించిన పంచాయితీ కలెక్టరేట్‌కు చేరింది. గిరిజన ప్రాంతం నుంచి నగరానికి బదిలీ జరిగిన ఏఎన్‌ఎంలను అక్కడి అధికారులు రిలీవ్ చేయకపోవడం, నగరం నుంచి ఇతర ప్రాంతాలకు బలవంతంగా బదిలీలు చేయడం, బదిలీల్లో అక్రమ వసూళ్ల తదితర అంశాలపై బాధిత ఏఎన్‌ఎంలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారాలపై సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్ పాత గ్రీవెన్సు హాల్ వద్ద పంచాయితీ జరిగింది. ఎటూ తేల్చుకోలేక వైద్య శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. మొత్తం 500పైగా బదిలీలు జరిగితే ఒకే స్థానాల్లో ఇద్దరిని, ముగ్గురిని సైతం నియమించేశారు. ఇలాంటి వారు సుమారు 60 మంది ఉన్నట్లు సమాచారం. సీతంపేట ఏజెన్సీ ఏరియాకు చెందిన వారిని సైతం శ్రీకాకుళం నగరంలో నియమించడంతో ఇది నిబంధనలకు విరుద్ధమని ఐటీడీఏ పీఓ రిలీవ్ ఆర్డర్లు ఇవ్వడం లేదు.

కలెక్టర్ ఆగ్రహం..

వైద్య శాఖలో నిబంధనలకు వ్యతిరేకంగా నగరంలోని సచివాలయాల్లో గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన ఏఎన్‌ఎంలను నియమిస్తు వైద్య శాఖ అధికారులు బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే లోపాలు సరిదిద్దాలని ఆదేశించడంతో సోమవారం అర్ధరాత్రి వరకు సంబంధిత అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. అయితే తప్పిదాలు దిద్దే అవకాశం లేకపోవడంతో రెండో రోజు మంగళవారం కూడా ఈ పంచాయితీ పూర్తి కాలేదు.

భారీగా ముడుపులు..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన బదిలీలలో భారీగా అవినీతి చోటుచేసుకుందనే ఫిర్యాదులు వచ్చాయి. వైద్య శాఖ అధికారుల అవినీతి, లంచాలు, నజరానాలపై పలువురు ఏఎన్‌ఎంలు బాహటాంగానే విరుచుకుపడ్డారు. దీంతో వైద్య శాఖ అవినీతి బండారం బయటపడింది. లక్షల్లో అవినీతి జరిగినట్టు ఫిర్యాదులు కలెక్టరేట్‌కి చేరినట్టు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే కొందరికి బదిలీలు పూర్తి కాగా, మరికొందరు పోస్టింగ్‌ల కోసం వేచిచూస్తున్నారు. సీనియార్టీ జాబితాను పక్కన పెట్టి ఖాళీల భర్తీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివక్ష చూపించడాన్ని నిరసిస్తూ కొంత మంది ఆర్డర్లు తీసుకోకుండా స్థానాల మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. ఈసారి జరిగిన బదిలీలలో అక్రమాలతో పాటు పదుల సంఖ్యలోని అభ్యర్థులకు డబుల్ పోస్టింగ్‌లు, ఒకే స్థానంలో పలువురిని నియమించడం, ఒకరికి పలు చోట్ల నియామకాలు చేయడం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ జాబితాలు కూడా కలెక్టర్‌కి ఫిర్యాదుల రూపంలో బాధితులు అందజేశారని తెలుస్తోంది. ఏఎన్‌ఎంల బదిలీలకు సంబంధించి పలువురు ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు, ఫోన్‌ల ద్వారా ఒత్తిడి తీసుకు వచ్చారు. వారిని పట్టించుకోకపోవడంతో వారి తరఫు నుంచి కూడా కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదుల చేశారు.

చర్యలకు సిద్ధం..

వైద్యశాఖలో ఏఎన్‌ఎంల బదిలీల్లో జరిగిన అవినీతి అక్రమాలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమౌతున్నట్టు తెలిసింది. జిల్లా అధికారి సరెండర్, ఇద్దరు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడే అవకాశం ఉంది. అయితే ఈ పంచాయితీ పూర్తయ్యాకే ఈ చర్యలు ఉంటాయని కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి. ఎవరు చేసిన తప్పులు వారు సరిచేసిన తర్వాతే అవినీతికి పాల్పడ్డవారిపై చర్యలకు ఉపక్రమించనున్నట్టు తెలిసింది.

సారా స్థావరాలపై విస్తృత దాడులు


స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, పలాస మండలాలకు ఆనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన సింగుపూర్, కుయారా, పెద్ద బురుజోల, చిన్న బురుజోల పరిసరాల్లో 160 లీటర్ల సారా, 12,700 లీటర్ల తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటలను ధ్వంసం చేసి, భారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ సూపరిటెండెంట్లు మురళీ, రామచంద్ర కుమార్, గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహూ, ఎన్‌ఫోర్స్‌మెంట్స్ వింగ్, పాతపట్నం, నరసన్నపేట, పొందూరు, శ్రీకాకుళం టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు, పర్లాకిమిడి, కాశీనగర్, గురండి, గారబంద ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే


విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గార: బంగారు కుటుంబాలు సర్వే పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం గారలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్‌తో కలిసి గ్రామ సభలో పాల్గొని సర్వే తీరును పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి సంక్షేమ కార్యక్రమాలు అమలును అడిగి తెలుసుకున్నారు. కొత్తూరు సైరిగాం వద్ద ఆటోలో యూరియా బస్తాలు వెళ్తుండటంతో వాటి వెనుకనే గ్రామంలోకి వెళ్లి 16 బస్తాలు ఒకేసారి ఎందుకు వెళ్తున్నామని ప్రశ్నించారు. ఎనిమిది మంది రైతులు తెచ్చుకున్నామని తెలియజేశారు. అనంతరం సమీపంలోని ఎంపీయూపీ పాఠశాలను సందర్శించి విద్యార్థుతో ముచ్చటించారు. మౌలిక వసతులపై హెచ్‌ఎం ఆర్.రమణమూర్తితో మాట్లాడగా.. అదనపు తరగతి భవనాలు అవసరమని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీఓ ఏ.రఘు తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

నరసన్నపేట:

దాతలు తమ ఔదార్యాన్ని చాటుతూ మానవత్వాన్ని చూపుతున్నారు. నరసన్నపేట మండలం దేవాది కాలనీలో ఆరు నెలల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు బాలికలకు దాతలు ఆర్థిక సహాయం చేస్తున్నారు. ఈ నెల 16న 'దేవాదిలో విషాదం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో బాలికలను ఆదుకోవడానికి దాతలు ముందుకు వస్తున్నారు. రెండు రోజుల క్రితం కంబకాయకు చెందిన దాతలు రూ.25500 అందించగా.. తాజాగా మంగళవారం సంతబొమ్మాళి మండలం గోవిందాపురానికి చెందిన శ్రీ రేయమ్మతల్లి యూత్(హెల్పింగ్ హ్యాండ్స్) సభ్యులు మరో రూ. 25 వేలు, టెక్కలి చెందిన అభయం సేవా సంఘం సభ్యులు రూ.50 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో అభయం సేవా సంఘం ప్రతినిధులు దేవాది శ్రీనివాసరావు, సింహాచలం, ధర్మారపు పూర్ణారావు, సర్పంచ్ మంతిన రాము తదితరులు పాల్గొన్నారు.


బాలికలకు నగదు అందిస్తున్న రేయమ్మతల్లి యూత్ సభ్యులు

కేజీబీవీ టీచర్లకు సొంత జిల్లాలోనే ట్రైనింగ్ ఇవ్వాలి

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు సమగ్రశిక్షా ప్రాజెక్ట్ అధికారులు జూలై 28 నుంచి రెండు విడతలుగా నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాలను వారు పనిచేస్తున్న సొంత జిల్లాల్లోనే నిర్వహించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 26 జిల్లాల్లో సబ్జెక్టుకు ఒక జిల్లా కేంద్రంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్ విడుదల చేయడం తగదన్నారు. సమగ్రశిక్షా ఎస్పీడీ ప్రత్యేక చొరవ తీసుకుని.. మానవతా దృక్పథంతో తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ, అనుబంధ కళాశాలల పరిధిలోడిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు వర్సిటీ పరీక్షల యూజీ డీన్ డాక్టర్ జి.పద్మారావు మంగళవారం తెలిపారు. రెగ్యులర్ విధానంలో 6,972 మందికి గాను 42.47 శాతం మంది, సప్లిమెంటరీలో 4,837 మందికి గాను 55.53 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి


రామకృష్ణ(ఫైల్)

హిరమండలం: ఎల్‌ఎన్‌పేట మండలం బొత్తాడిసింగి గ్రామానికి చెందిన గుమ్మడి రామకృష్ణ (44) పాముకాటుకు గురై సోమవారం రాత్రి మృతి చెందాడు. రామకృష్ణ భార్యతో కలిసి వ్యవసాయ పనులు చేసేందుకు పొలానికి వెళ్లారు. రామకృష్ణ పని చేస్తుండగా పాము కాటు వేయడంతో వెంటనే ఎల్‌ఎన్‌పేట పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈయనకు భార్య మహాలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మాజీ సైనికుడికి నివాళులు

బొడ్డపాడు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పోతనపల్లి దుష్యంతు హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ సైనికులు ఆధ్వర్యంలో భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పి గ్రామస్తులు ఘనంగా నివాళులు అర్పించారు. దుష్యంతుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

–పలాస




డబుల్ రోడ్డు పనులు పునఃప్రారంభం

సాక్షి ఎఫెక్ట్...


డబుల్ రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్ : పలాస నియోజకవర్గంలో బెండి గేటు నుంచి బెండి మీదుగా నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు నుంచి అక్కుపల్లి మీదగా కాశీబుగ్గ వరకు అధ్వానంగా మారిన రోడ్ల దుస్థితిపై 'ఎన్నాళ్లీ రహదారిద్ర్యం?' అనే శీర్షికతో ఈ నెల 19న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి పనులు పునఃప్రారంభించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నువ్వలరేవు–రేగిలపాడు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.23 కోట్లు, వజ్రపుకొత్తూరు అక్కుపల్లి మీదుగా కాశీబుగ్గ వరకు సుమారు రూ.21 కోట్లు వ్యయంతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లు సిద్ధం చేస్తామని చెప్పి ఏడాది కాలం దాటిన తర్వాత పనులు మళ్లీ ప్రారంభించడం కొసమెరుపు.

పోయాం మోసం..!



- ఉపాధ్యాయ, ఉద్యోగులకు నాలుగు డీఏల బకాయిలు
- ఐఆర్, పీఆర్‌సీపై కానరాని స్పష్టత
- హామీలు అమలు చేయకపోవడంపై ప్రభుత్వంపై ఆగ్రహం
- ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్న ఉద్యోగ సంఘాలు

శ్రీకాకుళం: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలతో పాటు ఉద్యోగులనూ వంచించింది. ఎన్నికల వేళ ఎన్నో వరాలను కురిపించి తీరా గద్దెనెక్కాక ఒక్క హామీని కూడా అమలు చేయకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోందన్న వాదన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల నుంచి వినిపిస్తోంది. 2023 జూలై నుంచి ఒక్క డీఏ కూడా ఉద్యోగ ఉపాధ్యాయులు అందుకోలేకపోయారు. దీంతో ఇప్పటివరకు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నట్లు అయ్యింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఆయా ఉద్యోగులకు ఒక్క డీఏ కూడా పెండింగ్ లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఒకటి రెండు నెలలు అటు ఇటుగా రాష్ట్ర ప్రభుత్వం సైతం డీఏలను ప్రకటించాల్సి ఉంటుంది. దీనిని కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదు.

చంద్రబాబు తీరే అంత..

1999 నుంచి 2004 వరకు అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉద్యోగులకు ఐదు డీఏలను రద్దు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో డీఏల సాధనకు డీఏ పోరాట సాధన కమిటీని ఏర్పాటు చేసుకొని ఉద్యమించినా ఫలితం లేకపోయింది. 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. చంద్రబాబు రద్దు చేసిన డీఏలతో పాటు కొత్త డీఏలు సైతం సకాలు చెల్లించి ఉద్యోగుల మన్ననలను పొందారు. 11వ ఆర్థిక సంఘం సమ్మిట్లో పాల్గొన్న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి సూచనలు చేస్తూ కేంద్రం రాష్ట్రాలతో సంప్రదించకుండా డీఏలను ఇస్తే రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుందని పేర్కొనడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వంలోనూ చంద్రబాబు ఇదే ధోరణి అవలంబిస్తున్నారని ఆందోళన చెందుతున్నారు.

పీఆర్‌సీ ఇప్పట్లో లేనట్లేనా..

పీఆర్‌సీకి సంబంధించి ఇప్పటికే రెండేళ్ల గడువు ముగిసింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2023 జూలై 24న పీఆర్‌సీ కమిటీని నియమించి దానికి చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మన్మోహన్ సింగ్‌ను నియమించిన తెలిసిందే. 2024 జూలైలోగా కమిటీ నివేదికను సమర్పించాలని గడువును విధించారు. 2024 మేలో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో మన్మోహన్‌సింగ్ తాను ఈ ప్రభుత్వంలో చైర్మన్‌గా పనిచేయలేనంటూ రాజీనామా చేశారు. ఇది జరిగి ఏడాది కావస్తున్న కొత్త చైర్మన్ను నియమించకపోవడాన్ని ఉద్యోగ సంఘాల నేతలు తప్పుపడుతున్నారు. తక్షణం చైర్మన్ను నియమించినా అధ్యయనానికి నివేదిక సమర్పించడానికి ఏడాది సమయం పడుతుంది. ఈ లెక్కన ఇప్పుడు కమిటీని నియమించిన 2026 ఆగస్టు వరకు నివేదిక సమర్పించే పరిస్థితి ఉండదు. అటు తర్వాత ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమ సంఘాలతో చర్చించడం మరలా పరిశీలనకు కమిటీ అంటూ మంత్రులను నియమించడం చంద్రబాబుకు ఆనవాయితీగా వస్తుందని, అంటే తక్షణం కమిటీని నియమించిన 2027 మార్చి వరకు పీఆర్‌సీ అమలు కాదన్నది తేటతెల్లమవుతుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. జమిలీ ఎన్నికలు జరిగితే 2027 లోనే జరిగే అవకాశాలు ఉండడంతో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పీఆర్‌సీ అమలు కాదేమోనన్న ఆందోళనలో ఉన్నారు. ఇటువంటి తరుణంలో ఉద్యమ బాట పట్టేందుకు కార్యాచరణ రూపొందించుకోవడంలో ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలు సమావేశమవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో ఇవి కార్యరూపం దాల్చి ఉద్యోగులు ఆందోళన బాట పట్టే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

తక్షణం ప్రకటించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన నాలుగు డీఏలను తక్షణం అమలు చేయాలి. పీఆర్‌సీని నియమించి ఐఆర్ను ప్రకటించాలి. డీఏలు అందక ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇప్పటికే ఎంతో నష్టపోయారు.

– చింతల రామారావు, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలి. సుమారు 20 వేల కోట్లు బకాయిలు ఉన్నాయి. పీఆర్‌సీ నివేదిక వచ్చే వరకు మధ్యంతర భృతి ప్రకటించి, డీఏ బకాయిలు చెల్లించాలి.

– కిలారి నారాయణరావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు

నేరాలను నియంత్రించాలి


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో నేరాల నియంత్రణకు అధికారులు కృషి చేయాలని, పెండింగ్ వారెంట్లు త్వరితగతిన అమలుకు పంపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు, పరిష్కారం, మాదకద్రవ్యాల నియంత్రణ, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ల అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు, విజిబుల్ పోలీసింగ్, కార్డన్ అండ్ సెర్చ్ సోదాలు వంటి అంశాలపై జిల్లాలో గల డీఎస్పీలు, సీఐలతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు వంటి మందిరాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసేలా కమిటీలను సన్నద్ధం చేయాలన్నారు. వాహనాల తనిఖీలు చేపట్టి గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించాలని, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా కళాశాలలు, పాఠశాలల పరిధిలో ఎలాంటి ర్యాగింగ్, ఇతర నేరాలు జరగకుండా చూడాలన్నారు.

యువకుడికి రిమాండ్

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రం సమీపంలోని బైరివానిపేట కూడలి, రాగోలు మార్గాల్లోనే కాకుండా కోర్టు ఆవరణలో పలు చోరీలకు పాల్పడిన పెద్దపాడు యువకుడు కె.రాముని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వెల్లడించారు. గతేడాది సెప్టెంబరు 14న బైరివానిపేట సమీప సురాస్ బిల్డ్ మార్ట్ షాపులో వైర్లు, ఎలక్ట్రిక్ సామగ్రి, రాగోలుకు వెళ్లే దారిలో అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్‌లో ల్యాప్‌టాప్, కోర్టు ఆవరణలో టీవీ, ఆదిత్యనగర్‌కాలనీలో నిర్మాణదశలో ఉన్న అపార్ట్‌మెంట్లో వైర్లు, సంస్కార్ స్కూల్లో వైర్‌బండిళ్లు, పీఎన్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న ఏవీఎం టవర్స్ అపార్ట్‌మెంట్ వద్ద వైర్ బండిళ్లను రాము చోరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. గతంలో హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇంటి తలుపులు పగులగొట్టి చోరీలు చేసినట్లు తెలిసిందన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందన్నారు. నిందితుడి నుంచి రూ. 3 లక్షల విలువైన ప్రాపర్టీని స్వాధీనం చేసుకుని జిల్లా జైలుకు తరలించామన్నారు.

జీతాల సమస్య పరిష్కరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ : వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లు, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు జీతాల చెల్లింపుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించి త్వరితగతిన జీతాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.